# మోగింది కళ్యాణబాజా



మా పెళ్ళయి అప్పటికి నాలుగు రోజులయింది. చుట్టాలందరూ వెళ్ళిపోయారు. ఇంట్లో వాళ్ళం కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాం. అమ్మ వంటిట్లో వంట చేస్తోంది. అంతా ఆనందమయ వాతావరణం. ఇంకో నాలుగు రోజుల్లో మేమిద్దరం పూణె వెళ్ళిపోవాలి. మర్నాడు పొద్దున్నే మా పెద్ద చెల్లెలు చిన్నారి చీరాల వెళ్ళాలి. తను అక్కడ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరరుగా పని చేసేది. మా ఆయనకప్పటికే జాతకాలు బాగా చెప్తారని పేరు వచ్చేసింది. మరి ఈ నాలుగు రోజుల్లో ఎవరెవరి చేతులు చూసారో! అబ్బే అది కారణం అయివుండదు. మా పెళ్ళికి తాతగారు ముహూర్తం

పెడితే అందులో దోషాలున్నాయని చెప్పి ఒక రోజు ముందుకి జరిపించారు. మా తాతగారు మళ్ళీ పరీక్షచేసి నాలిక్కర్చుకుని చిన్నవాడైనా, జ్యోతిశ్శాస్త్రంలో వుద్దండుడని బిరుదు ఇచ్చారు. ఆ వార్త అందరికీ చేరినట్లుంది. అందరూ తీరుబడిగా వుండడంతో మా చెల్లెళ్లందరూ ఆయనచుట్టూ చేరారు. అందరిదీ ఒకటే ప్రశ్న "మా పెళ్ళిళ్ళెప్పుడవుతాయ"ని. నాకన్నా చిన్నారి ఏణ్ణార్థం చిన్నది. దానికన్నా ఇందూ అంతే. ఇందుకీ బుజ్జికీ రెండేళ్ళు తేడా. మొత్తం మీద బుజ్జి నాకన్నా అయిదేళ్ళు చిన్నది అంతే. వంటింట్లోంచి మా అమ్మ "అతన్ని విసిగించవద్ద"ని అరుస్తోనే వుంది కానీ ఎవరు వింటారు! ఎవరి ఆత్రం వాళ్ళది.

చిన్నారి నా కన్నా చిన్నదే అయినా కొంచెం ఎత్తరిగా అర్థాంగి సినిమాలో సావిత్రిలాగా వుండేది. పెద్దజడ. దాని ప్రవర్తన కూడా ఆ సినిమాలో అమ్మాయిలాగానే వుండేది. కాలేజీలో పిల్లలు సావిత్రీ అని, కృష్ణకుమారీ అని పిలుస్తూ గోలచేసేవారు. కాలేజ్‌లో మంచి బ్రైట్ స్టూడెంట్‌గా పేరు పడ్డందువల్ల అభిమానులు కూడా బాగానే వుండేవారు. ఇంతమంచి వుద్యోగంలో వున్నదానికి పెళ్ళవడం ఏ కష్టం, మా నాన్న కాస్త నడుం కట్టాలి గానీ!

అందరూ చేతులు చాపారు గానీ మా ఆయన ముందుగా చిన్నారి చెయ్యి చూసారు. ఒక పావుగంట సేపు అటు, ఇటు తిప్పి చూశారు. ఏమీ మాట్లాడలేదు. దానికి గాభరా పుట్టింది. "చెప్పండి బావగారూ! ఏమిటీ ఆలోచన" అని మళ్ళీ మళ్ళీ అడిగింది. ఏమీ మాట్లాడకుండా ఇందు చెయ్యి చూసారు. ఒక రెండు నిమిషాలు దీనిది, ఇంకో రెండు నిమిషాలు బుజ్జిది చూసి లేవబోయారు. అంత త్వరగా వెళ్ళనిస్తారా మనవాళ్ళు. "భలేవారే! అలా ఎలా వెళ్ళి పోనిస్తామండీ! ఏదో ఒకటి చెప్పే వెళ్ళాలి" అని అందరూ కలిసి దబాయించారు. ఈయన "నేను నిజం చెప్తే మీకు కోపం వస్తుంది. ఏదో ఒకటి చెప్పడం నాకిష్టం వుండదు. కాబట్టి నేను చెప్పకపోవడమే మంచిది' అన్నారు. "మీకు తెలిసినది చెప్పండి. మేము ఏమీ అనుకోము. మిమ్మల్ని ఏమీ అనం" అని పరిపరివిధాల బ్రతిమాలాక నెమ్మదిగా చెప్పారు. "చిన్నారీ! మీ పెళ్ళి ఇంకొక అయిదు సంవత్సరాల వరకూ అయే అవకాశం లేదు. ఈ సమయం మీకు అనుకూలంగా లేదు. చాలా సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఆ తరువాత మీ జీవితం అన్ని విధాలా బాగుంటుంది. ఏ సమస్యలూ వుండవు. మీ పెళ్ళి ఇందుపెళ్ళి ఇంచుమించు వెంటవెంటనే అవుతాయి. బుజ్జిపెళ్ళి, ఆ తరువాత అయిదేళ్ళకి అవుతుంది" అని అందరి పెళ్ళిళ్ళకీ ముహూర్తాలు పెట్టినంత ఖచ్చితంగా చెప్పారు.

వంటింట్లో గుమ్మంలో నిలబడి వింటున్న మా అమ్మ "ఇప్పటికే చాలా సంబంధాలు వస్తున్నాయి నాయినా! ఒక రెండ్రెళ్లాగి మా వర్కు బిల్లులన్నీ వచ్చాక ఈ వేసంకాలం లోపల దీని పెళ్ళి కూడా చేసేద్దామనే అనుకుంటున్నాం" అని చెప్పింది. ఈయన "అలా జరిగితే మంచిదేకదా! నాకేం అన్ని సంగతులూ తెలుస్తాయా" అని వెళ్ళిపోయారక్కడ్నించి. ఆయన అటు వెళ్ళిపోగానే అందరూ ఒకటే గోల. ఇంక బుజ్జి అయితే "ఇప్పుడే నాకు పదహారేళ్ళు. ఇంకో పదేళ్ళంటే ముసల్దాన్నయిపోతాన'ని గోల పెట్టింది. చిన్నారి "నీ బొంద. ఇప్పట్నించీ పదేళ్ళని బావగారు చెప్పలేదు. నా పెళ్ళయ్యాక అయిదేళ్ళని చెప్పారు. అసలు నా పెళ్ళే అవకపోతే నీ పని గోవిందా! నోరు మూసుకో!' అని ధూంధాంలాడుతూ డాబా మీదకెళ్ళిపోయింది. నేను నెమ్మదిగా దాని దగ్గరకెళ్ళి "ఈయనేవన్నా బ్రహ్మదేవుడా ఏవిటే! పది చెప్తే రెండు రైటవుతాయి. అది చెప్పడానికి ఈయనే అక్కర్లేదు. ఎవరు చెప్పినా అవుతాయి. ఇలాటివి సరదాకి విని వూరుకోవాలి గానీ సీరియస్‌గా తీసుకోకూడదు. నాకూ చెప్పారు. నేను పేటెంట్స్ చేసి బోలెడు డబ్బుగడిస్తానుట. నేను నమ్ముతున్నానా? మనం ఏమిటి! పేటెంట్స్ చేయడం ఏవిటి?" అని అప్పటికి దాన్ని వూరుకోపెట్టాను.

నా పెళ్ళి నాటికి మా నాన్న సివిల్ కాంట్రాక్టులు చేసేవారు. అప్పటికి ముప్పై ఏళ్ళుగా తను రక్తమాంసాలు ధారపోసి పని చేసిన కంపెనీ మూసివేసే పరిస్థితిలో వుండడం వల్ల వుద్యోగం మానేసి, తన పిత్రార్జితం ఎనిమిదెకరాలు అమ్మేసి కాంట్రాక్టులు చేయడం మొదలు పెట్టారు. గొడ్డు చాకిరీ చేయడమే తప్ప వ్యాపారంలో ఆనుపానులు తెలియని మా నాన్న తీవ్రంగా నష్టపోయారు. అసలు పనులు చేస్తూ పోవడమేగానీ ఒక్క రూపాయి తిరిగి రావడమెరుగరు. అప్పటికి రావల్సిన రెండు లక్షల రూపాయలు చేతికందాకే నా పెళ్ళి చేద్దామనుకున్నారుగానీ అవి రాకుండానే నా పెళ్ళి జరిగిపోయింది. అప్పటి వరకూ నేనూ, చిన్నారీ తెచ్చే జీతాలతోటీ నా ట్యూషన్లతోటీ అంత ఇబ్బంది తెలిసేది కాదు. ఎలాగూ నాన్నకి రావల్సిన డబ్బులొస్తాయి కదా అని నేను ధైర్యంగా మా ఆయనతో పూణె వెళ్ళిపోయాను.

వ్యాపార సూత్రాలు తెలియని మా నాన్న ఇవ్వవలసిన వాళ్ళకి ఆమ్యామ్యాలు ఇవ్వకపోవడం వలన మా వాళ్ళు వస్తాయనుకున్న రెండు లక్షలూ ఎప్పటికీ రాలేదు. చిన్నా పెద్దా అప్పులతో మా అమ్మా, నాన్నా భూలోక నరకం అనుభవించారు. కుటుంబం రోడ్డున పడ్డట్టయింది. చిన్నారి ఇంటికి అంతులేని కథలో జయప్రదలాగా అయింది. సరిగ్గా అదే సమయంలో దేవుడు కరుణించినట్లు దానికి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరరుగా గెజిటెడ్ పోస్టు వచ్చింది. ఇంతా

చేసి దాని వయసప్పటికి ఇరవైఏళ్ళు. వెంటనే వెళ్ళి కాకినాడలో వుద్యోగంలో చేరింది. మా తాతగారింట్లో వుండేది. ఈలోగా మా నాన్నకి శ్రీశైలంలో ఒక వుద్యోగం వచ్చి అక్కడికి వెళ్ళిపోయారు. ఒక మూడేళ్ళపాటు దాని జీతమంతా అప్పుల మీద వడ్డీలు కట్టేందుకు, అప్పులు తీర్చేందుకు సరిపోయేది. అందరూ మామూలు స్థితికి వచ్చేటప్పటికి సరిగ్గా అయిదేళ్ళు పట్టింది. ఈ లోపల మేము ఇందుని పూనా తీసుకెళ్ళి ఎమ్మెస్సీలో చేర్పించాం. ఇన్ని అవాంతరాలు జరిగినా మా నాన్న ఆలోచనల్లోగాని పద్ధతుల్లోగాని ఏమీ మార్పులేదు. దిగులు కూడా లేదు. ఎప్పుడూ సంతోషంగా వున్నట్లే కనిపించేవారు. మా రాజన్నయ్య పుణ్యమా అని నాన్నకి విశాఖపట్నంలో మంచి వుద్యోగం రావడంతో కుటుంబమంతా కాకినాడ చేరి ఒక ఇల్లు అద్దెకి తీసుకొని స్థిరపడ్డారు.

ఇంక ఇప్పుడు చిన్నారి పెళ్ళి గురించి ఆలోచన మొదలైంది. ఈ రోజుల్లో ఎవరైనా పాతికేళ్ళ అమ్మాయికి సంబంధం చెపితే వాళ్ళ అమ్మావాళ్ళు 'ఇప్పుడే ఏం పెళ్ళండీ! మా బేబీ ఇంకో రెండేళ్ళు వుద్యోగం చేస్తూ ఎంజాయ్ చేస్తానంటోంది' అని చెప్తున్నారు కానీ నలభై ఏళ్ళ కిందట అమ్మాయికి పాతికేళ్ళు వచ్చాయంటే తగ్గ వరులు దొరకడం కష్టమే. పైగా తను ఎత్తరి పిల్ల. అదేవిటో మా బ్రాహ్మల్లో మగపిల్లలంతా వల్చగా పొట్టిగా వుండేవారు. దాంతో జోడీ కుదరడం కష్టమవుతుందేమోనని కొంచెం భయంగానే వుండేది. ఇందు ఎమ్మెస్సీ పాసయి వుద్యోగంలో చేరితే చిన్నారిని రిలీవ్ చేయచ్చని ఇంట్లో అందరం అనుకునేవాళ్ళం గానీ అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా! మేం పూణెలో వున్నప్పుడు అదే యూనివర్సిటీలో చదువుకుంటున్న హరి అనే మనవాళ్ళ కుర్రాడొకడు మా ఇంటికి తరచు వచ్చేవాడు. అతనికీ ఇందుకీ స్నేహం కుదిరింది. కానీ చిన్నారి పెళ్ళయితేగానీ ఏమీ ఆలోచించమని నాన్న చెప్పడంతో ఆ అబ్బాయే చిన్నారి కోసం సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాడు.

మేమందరం చదువుకున్నది విజయవాడకాలేజీలోనే. ఆ రోజుల్లో చిన్నారికి అభిమానులు చాలా మంది వుండేవారని చెప్పానుకదా! అందులో ఒకతను ఢిల్లీ సి.బి.ఐ.లో మంచి వుద్యోగం చేసేవాడు. అతనికి మన హరి మంచి ఫ్రెండు. విషయం తెలియగానే పరిగెత్తుకుంటూ ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చేసాడు. ఏదో ఒక బంధువుల ఇంట్లో పెళ్ళి అవుతుంటే హరే పెళ్ళి చూపులు కూడా ఏర్పాటు చేసేసాడు అటువంటివేమీ అవసరం లేదని ఆ అబ్బాయి మొత్తుకుంటున్నా. మా చిన్నారి మాత్రం అతన్ని చూడటం అదే ప్రథమం. మంచి ఆజానుబాహువు. సౌమ్యరూపం.

ఇద్దరూ ఒకళ్ళకోసమే ఒకళ్ళు పుట్టినట్లున్నారు. మా అక్కచెల్లెళ్ళం అతని మీద ఒక పద్యం కూడా రాసాం. "వరుడు, బాపేశ్వరుడు, అందానికి ప్రవరుడు, ఠీవికి లంకేశ్వరుడు" అని.

ఇంతవరకూ బాగానే వుంది కానీ వాళ్ళదీ చాలా మధ్యతరగతి కుటుంబం. అతనికి చాలా బాధ్యతలున్నాయి. ఇద్దరూ ఎవరి కుటుంబ బాధ్యతలు వాళ్ళు మోయాల్సి వస్తుంది కాబట్టి రెండోవాళ్ళు అభ్యంతర పెట్టకూడదని తీర్మానానికి వచ్చారు. అతని ఇంట్లో కూడా మంచీ చెడూ ఈదేది వాళ్ళ అమ్మగారే. కనీసం మూడువేలయినా ఇవ్వకపోతే కుదరదని ఆవిడ చెప్పడంతో "అయితే మేం పిల్లనివ్వం" అని చెప్పి మా నాన్న కాకినాడ వచ్చేసారు. మళ్ళీ మా అమ్మా చిన్నారీ ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. మా బాబాయ్ తాను రెండు వేయిలు సద్దుతాననీ నాలుగు నెలల్లో తీర్చాలనీ అనడంతో మళ్ళీ సంబంధం ఖాయం చేసుకున్నారు. ఇక్కడ పూణెలో నా డిగ్రీ పూర్తి అవడం ఇద్దరు పిల్లలు పుట్టడం అయింది. ఇంక ఫెలోషిప్పు కూడా ఆగిపోయింది. అప్పటికి ఉద్యోగ ప్రయత్నంలో వున్నా. ఉద్యోగం వున్నా లేకపోయినా నాకెవరయినా జీతం ఇచ్చినా ఇవ్వకపోయినా నేను మాత్రం ఆఫీసువేళలు పాటిస్తూ ఏదో ఒక పని చేస్తూనే వుండాలి. నేనెప్పుడయినా డబ్బుకి ఇబ్బందిగా వుందంటే "మీ ఆయనకి జీతం వస్తోందిగా! ఇద్దరి జీతాలేం చేసుకుంటారు?" అని కసిరేవాడు మా గైడు.

ఇంతలో చిన్నారి పెళ్ళి నిశ్చయమయిందనీ ఫలానా రోజుకి వచ్చేయమని రాసింది అమ్మ. ఆవిడకి ఇక్కడ మా పరిస్థితులు తెలియవుగా! ఒక వెయ్యిరూపాయిలుంటే మమ్మల్ని వచ్చేటప్పుడు తెమ్మని రాసింది. అమ్మ ఉత్తరం చూడగానే ముందు మా దగ్గిరున్న వెయ్యిరూపాయలు పంపించేశాం. దాంతో ఇంటిల్లిపాదిమీ కలిసి పెళ్ళికి వెళ్ళే పరిస్థితి లేదు. పిల్లల్నిద్దర్ని తీసుకుని నేను ఒక్కదాన్నే ప్రయాణమయ్యాను. అతి కష్టంమీద గైడు గారూ, మా ఆయనా కలిసి వారం రోజులు సెలవు మంజూరు చేసారు. నాతో పాటు వచ్చే ఇద్దరూ టికెట్‌లెస్ ట్రావలర్స్. ఒక బర్తు ముగ్గురు జీవులు. మా అమ్మాయికి మూడోఏడు. వాడికి ఏడాది వెళ్ళి మూడ్నెల్లు. నాకు ఒక్కత్తినీ పిల్లల్ని చూసుకోవడం అంత బాగా రాదు. అంతా బామ్మ పెంపకం కదా! ఇద్దరు పిల్లలతో రైళ్ళు మారి ఇంతదూర ప్రయాణం ఎలా చేస్తుందా అని ఆ తల్లీ కొడుకులకి ఆలోచనుండాలా? కనీసం రైలెక్కించడానికి స్టేషను వరకూ కూడా రాలేదు. కానీ నా కూతురు మూడేళ్ళదయినా పదేళ్ళ పిల్లలాగా ప్రవర్తించేది. అది ఎలా చెప్తే అలా వాడు వినేవాడు. ఒక చోట కూచోబెట్టి నేవచ్చేవరకూ అలా వుండండంటే

తిరిగి వచ్చేవరకూ కదలకుండా అలాగే వుండేవారు.

సికింద్రాబాదులో కూడా ఎవరూ స్టేషనుకి రాలేదు. ఎలా వస్తారు. నేను ఎవరికైనా రమ్మని రాస్తే కదా! ఆటో చేసుకుని నేనే మా మావయ్య ఇంటికి వెళ్ళాను. వాళ్ళకిదివరకెప్పుడో నాకు వాళ్లతోబాటు కాకినాడ వరకు టికెట్టు కొనమని రాశాను. ఎవరూ నాకోసం ఏ టికెట్టూ కొనలేదు. వాళ్ళందరూ మధ్యాహ్నం కారులో బయలుదేరి కాకినాడ వెడుతున్నామనీ, నన్ను కూడా వాళ్ళతో తీసుకెళ్ళవచ్చుకదాని చెప్పి నాకు టిక్కెట్టు కొనలేదనీ చెప్పారు. ఇంకేం చేస్తాను! ఆరుగురు పట్టే కారులో పదిమందిమి ఎక్కి మధ్యమధ్యలో ఆగుతూ అర్థరాత్రికి ఏలూరు చేరాము. గెస్ట్‌హౌస్‌లో అందరికీ పడుకునే ఏర్పాట్లు చేశారు. అప్పుడు చెప్పారు చల్లటి కబురు - వాళ్ళు తిన్నగా కాకినాడ రావడంలేదుట. మధ్యలో ఒక రోజు రాజమండ్రిలోను మరోపూట ధవళేశ్వరంలోను ఆగి తిన్నగా అక్కడ్నించి పెళ్ళికి ఒకరోజు ముందు కాకినాడ చేరతారుట. దాంతో నాకు పట్టరాని కోపం వచ్చి తెల్లవారకట్లే బస్టాండుకి వచ్చి మూటు టిక్కెట్లు కొని కాకినాడ బస్సెక్కాను. ఆ ప్రయాణం మాత్రం నేనెప్పటికీ మర్చిపోలేను. నా బుజ్జి బంగారాలు నేనేది పెడితే అది తింటూ వాళ్ళలో వాళ్ళు ఆడుకుంటూ నాకు ఎంతో సాయం చేశారు. బస్సు దిగి రిక్షా చేసుకుని ఇంటికెళ్ళేటప్పటికి ఒంటిగంటయింది. నన్నూ పిల్లల్ని చూసి మా అమ్మ ఒకటే కళ్ళనీళ్ళపర్యంతమయింది. "అదేం ఆయోమయాలే అమ్మా! ఒక్కదాన్నీ ఇద్దరు పిల్లల్తో ఎలా పంపగలిగారే" అంటూ. వాళ్ళ బామ్మని కానీ, నాన్నని కానీ ఒక్కమాట అననిచ్చేది కాదు నాకూతురు. వాళ్ళనేదో మా అమ్మ అనేస్తోందనుకుని నేలమీద కూలబడి భోరుభోరున ఏడ్చారు అక్కా, తమ్ముడూ. అమ్మో అని మావాళ్ళు ఝుడుసుకుపోయి మళ్ళీ వాళ్ళ పేరెత్తితే వట్టు. మా వాడు నన్ను ఒక్క నిమిషం కూడా వదిలేవాడు కాదు. మళ్ళీ పూణె చేరేవరకూ వాడినలా మోస్తూనేవున్నాను.

మా అమ్మావాళ్ళూ శ్రీరాంనగర్లో ఒక పెద్ద అరుగులున్న ఇంట్లో సగం వాటాలో అద్దెకుండేవాళ్ళు. ఇంటివాళ్ళు చాలా మంచివాళ్ళు. మా అమ్మ నోటివరమో ఏమో ఎక్కడున్నా అందరితో స్నేహంగా వుండేది. ఆ ఇరుగూ పొరుగూ అందరూ తమరింట్లో పెళ్ళన్నట్లే పనులందుకున్నారు. నేను వెళ్ళేటప్పటికే అప్పడాలు, వడియాలు, ఊరు మిరపకాయలు అన్నీ తయారు పెట్టారు. బోలెడు గోంగూర పచ్చడి, దోసావకాయ, కందిపొడి చేసారు. మాకు పాలుపోసే ఆవిడ తన తోటికోడళ్ళతో వచ్చి బోలెడు అరిసెలు, చలివిడి, అటుకుల మిక్సురు చేసిపెట్టింది. పెళ్ళి వాకిట్లో అరుగుల మీద చెయ్యాలని అనుకున్నారు.

వీధివాకిట్లో అరుగుకి ముందు పందిరి వేసారు. ఇంక పందిరి అలంకారం ఏవిటయ్యా అంటే మావిడాకులే. ఇంజనీరింగు కాలేజి ఒక మామిడి తోట లాగా వుండేది. వాళ్ళ కాలేజి ప్యూనులే నాలుగు బస్తాల మావిడాకులు కోసుకొచ్చి చిక్కంగా ధారాళంగా పందిరికంతా కట్టిపోయారు. ఆ పందిట్లోనే చిన్నగా మంటపం కట్టించి అక్కడున్న నందివర్ధనం చెట్టుకి లైట్లు పెట్టించాలని మా అమ్మ ఆశ పడింది. కానీ మన ఆర్థికమంత్రిగారు శాంక్షను చెయ్యలేదు. పీటలేసుక్కూచుంటే చాలని మండపం కట్టించడానికి చిన్నారి వప్పుకోలేదు. ఇంతట్లోకీ కోదాడ నుంచి మా పిన్నీ బాబాయి వచ్చారు. మా అమ్మ బాబాయి చెవిలో ఏం వూదిందో ఏమో "ఇది నా ప్రెజంటే" అంటూ సాయంత్రానికల్లా ఎవరో ఇద్దరు కుర్రాళ్ళతో చక్కటి కొబ్బరి ఆకుల మండపం కట్టించాడు. ఆ పందిట్లో వందకుర్చీలు పట్టే జాగా వున్నా ఏభై చాలని మిగతా జాగా అంతా జంపఖానాలు పరిపించింది. దాని పెళ్ళి అంతా దాని పెత్తనమే. వందో రెండు వందలో కార్డులు వేయించింది. వాళ్ళ కాలేజ్ స్టాఫ్ అంతా పొద్దున్న ఎనిమిదిన్నర ముహూర్తానికి వచ్చి అక్షింతలేసి కాలేజికి వెళ్ళి, సాయంత్రం మళ్ళీ వచ్చి లడ్డూ, మిక్సురూ తిని కాఫీతాగి ఇళ్ళకి వెళ్ళిపోయారు. పెళ్ళికి వచ్చిన బంధువులూ, సాయంచేసిన ఇరుగు పొరుగులకీ తప్ప తతిమ్మా వాళ్ళెవరికీ భోజనాలు లేవు.

ఇంక మగపెళ్ళివారయితే మమ్మల్ని మించిపోయారు. కేవలం పదముగ్గురొచ్చారు. శ్రీరాంనగర్ స్టేషన్‌కెళ్ళి అక్కడ్నించి నడుస్తూనే విడిదికొచ్చాం. ఇద్దరు కూలీలని సామాన్లు తేవడానికి పెట్టాం. మా ఇంటి పక్కన ఉపాధ్యాయుల వారి ఇల్లే విడిది. మేం చేసిన ఆ పాటి మర్యాదలకే సంతోషపడ్డారు వాళ్ళు. ఎక్కువ అనవసరపు ఆడంబరాలు చేయలేదేమో గాని ఎవరికీ మర్యాదల లోపం మాత్రం చేయలేదు. చిన్నారి స్టూడెంట్సు కొందరికి కడియంలో పెద్ద గులాబీ తోటలున్నాయి. ఇది వాళ్ళని ఆహ్వానించకపోయినా దీని మీద గౌరవంతో రకరకాల రంగురంగుల గులాబీలు నాలుగు బుట్టలతో పంపించారు. తెల్లవారి ముహూర్తం సమయానికి పచ్చని మామిడాకుల మధ్యలో నుండి తొంగి చూసే వన్నెవన్నెల గులాబీ బాలల అందాలతో మురిసిపోయిన ఆ పెళ్ళి వేదిక శోభ, కొన్ని లక్షలు ఖర్చు చేసి తయారు చేసే నేటి వేదికలకి ఏ మాత్రం తీసిపోలేదు.

పెళ్ళి టైంకి నేను కట్టుకున్న పట్టుచీర నలిగినట్లయింది. దాన్ని చూసి మా అత్తయ్య "ఏవిటే ఈ చీర అయోమయంగా! కాస్త మంచిదేవన్నా కొనుక్కోపోయావా?" అనడిగేటప్పటికి నాకు దు:ఖం వచ్చేసింది. "ఏం చెయ్యనత్తయ్యా! వీడు చెయ్యి

దిగితేనా! ఏది కట్టుకున్నా ఒకటే" అన్నా. "ఒరే ఇటురా నాన్నా! అలా టాటా వెడదాం" అని పిల్చింది. వెంటనే వాడు "బామ్మా" అని అరుపులు మొదలు పెట్టాడు. నేను "వస్తుందిరా! పాపం బామ్మ బాత్‌రూంకెళ్ళింద"ని చెప్పగానే ఠక్కున నోరు మూసుకున్నాడు. చంటి వెధవ కదా నేను ఏం చెప్పినా నమ్మేవాడు. నా వెనకాలే నా చీర పట్టుకుని తిరుగుతున్న నా కూతురు నవ్వబోయి నా మొఖం చూసి వూరుకుంది. ఆ విధంగా ఆ పెళ్ళి ప్రయాణం వారంరోజులూ మా అత్తగారు బాత్‌రూంలో వుండిపోయారు మరి. పిల్లల్ని పెంచడం ఎంత కష్టమో నాకు బాగా అనుభవానికొచ్చింది. మా అమ్మావాళ్ళూ ఇంకో నాల్రోజులుండమని బతిమిలాడినా, మా ఆయన పొరపాట్న పర్మిషనిచ్చినా నేను మాత్రం వుండేదాన్ని కాదు. మా అత్తగారు "పిల్లల్ని పెంచడం కన్నా బిచ్చమెత్తుకోవడం మేలు" అని తరచూ అనే మాట నేను కనీసం పదిసార్లు తల్చుకునుంటాను.

ఉదయాన్నే సలక్షణంగా శోభాయమానంగా పెళ్ళి జరిగింది. ఎందరో పెద్దలు వచ్చి ఆశీర్వదించి తాంబూలాలు తీసుకుని వెళ్ళారు. మధ్యాహ్నం వంటలు బ్రహ్మాండంగా కుదిరాయి. కాకినాడ వంట బ్రాహ్మలు చాలా ప్రసిద్ధులు కదా! మా చుట్టాల్లో చాలామందివి కాకినాడ చుట్టుపక్కల వూళ్ళే. అందరూ భోజనాలవగానే వెళ్ళిపోయారు. సాయంత్రం రిసెప్షను టైంకి చిన్నారి వాళ్ళ అత్తగారు పెట్టిన పట్టుచీర కట్టుకుంది. అతను సూట్ వేసుకున్నాడు. ఇద్దరూ సగం అలంకారం వల్లా మిగతా సగం ఆనందం వల్లా మెరిసిపోయారు. అందరూ అభినందించి స్వీటు హాటు తిని, కాఫీ తాగివెళ్ళిపోయారు. రాత్రి తొమ్మిది వరకూ అందరం పాటలు పాడుతూనే వున్నాం. పెద్ద టెన్షన్ లేకపోవడం వల్ల అందరం విశ్రాంతిగా సంబరాలు చేసుకున్నాం.

రకరకాల బహుమతుల పాకెట్లు వచ్చాయి. మాకన్నీ ఖంగారే కదా! ఒక్కొక్కటే విప్పి చూడ్డం మొదలుపెట్టాం. ముందు మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ పాకెట్టు తెరిచాం. రెండు లీటర్ల పాలు పట్టే మిల్క్ కుకర్. "ఆహా! బాగుంది. నలుగురం కలిసినప్పుడు పనికొస్తుంది" అని అనుకున్నాం. రెండవది సివిల్ డిపార్ట్‌మెంటుది. "దేవుడా ఇందులో ప్రెషర్ కుకర్ వుండేలా చూడు తండ్రీ" అని దణ్ణం పెట్టుకున్నాం. అబ్బే అది ఒక్క లీటరు పాలు పట్టే మిల్క్ కుకర్. పోన్లే రోజూ ఇంట్లో వాడుకోవచ్చు అనుకున్నాం. ఇంక కెమికల్, ఎలక్ట్రికల్, మాథమాటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు, మానేజ్‌మెంట్, ఎడ్మినిస్ట్రేషన్ ఏ డిపార్టుమెంటునించయినా రకరకాల మిల్క్ కుక్కర్లే! మొత్తం వచ్చిన పదహారు ప్రెజంట్లలో పన్నెండు అవే వచ్చాయి. మిగతావి ఏవో పుస్తకాలు. చిన్నారి 'నే చెప్పానా? మా వాళ్ళంతే! ఒక

డిపార్టుమెంటుతో ఇంకోళ్ళు మాట్లాడుకోరు. ఎవడో కానీ అందరికీ ఒకటే అమ్మాడు అని ఒకటే నవ్వు. అందరం తలా ఒకటి తీసుకున్నాం. మళ్ళీ వెనక్కిద్దామన్నా లేకుండా అన్నిటిమీదా ఫుల్ ఎడ్రసుతో సహా పేర్లు కూడా చెక్కించి మరీ ఇచ్చారు.

మా బంధువులందర్నీ బహుమతులకి బదులుగా డబ్బులే ఇవ్వమనీ అది పెళ్ళి ఖర్చులకి పనికొస్తుందనీ ముందుగానే చెప్పిందిట. మొత్తం రెండువేల వరకు క్యాష్ వచ్చింది. కట్నం మూడువేలతో కలిపి ఆ పెళ్ళికి  ఎనిమిది వేలు ఖర్చయింది. మా బాబాయ్ రెండువేలు అప్పుగా ఇచ్చాడు. నాల్నెల్లలో చిన్నారి ఆ అప్పంతా తీర్చేసింది. నా పెళ్ళితో అయిన అనుభవంతో ఎక్కడా ఒక్క రూపాయి కూడా బాకీ పెట్టలేదు. అంతే కాకుండా మూడు నెలల వెచ్చాలు ఇంట్లో వుంచి, ఇంటివాళ్ళకి మూడు నెలల అద్దె కూడా ఇచ్చింది. అలా ఎందుకు చేసిందంటే మా నాన్న పని చేసే కంపెనీ వాళ్ళు పదిహేను రోజులు సెలవు ఇవ్వమన్నారని వుద్యోగానికి రాజీనామా చేసి వచ్చారుట. మా అమ్మ లబోదిబోమని గోల చేసి మా రాజన్నయ్యకి వుత్తరం రాస్తే తను వాళ్ళతో మాట్లాడి ఇంకో రెండువందలెక్కువ జీతంతో మళ్ళీ వేయించాడు. అదే తను మాకిచ్చిన బహుమతి. మా అమ్మకోసం ఏదైనా చేసేవాడు రాజన్నయ్య.

ఇంత వివరంగా ఈ పెళ్ళి విశేషాలు ఎందుకు రాసానంటే అప్పటికీ ఇప్పటికీ మానవ మనస్తత్వాలలో ముఖ్యంగా ఆడపిల్లలలో ఎన్ని మార్పులు వచ్చాయో కొందరైనా గ్రహిస్తారని. నిరాడంబర జీవితం చాలా సుఖంగా వుంటుందని ఎవరూ గ్రహించడం లేదు. ఇప్పుడేదయినా పెళ్ళి సంబంధం చెప్పబోతే పిల్లవాడి జీతం ఎంత, స్వంత ఫ్లాట్ వుందా, కారు వుందా, బాధ్యతలేమీ లేవు కదా అని అడుగుతారు. అలాగే అబ్బాయిలు కూడా అమ్మాయి హోదా, జీతం, భవిష్యత్తులో అవకాశాలు అందం చూస్తున్నారు. ఇరుపక్షాలూ అందచందాలకిచ్చిన ప్రాముఖ్యత గుణగణాలకివ్వడం లేదు. అబ్బాయికి అమ్మానాన్నలు, అక్కాచెల్లెళ్ళు, అన్నదమ్ములు లేకపోతేనే మంచిదనుకునే రోజుల్లో వున్నాం మనం. ఇపుడు ఎవరైనా కోరుకునేది ఇద్దరు వ్యక్తుల మధ్య అనుబంధం కానీ రెండు కుటుంబాల మధ్య కాదు. భార్యాభర్తలు తప్ప మిగిలినవారంతా అతిథులే. కొద్దికాలం వెనుక పోనీ నలభై సంవత్సరాల క్రితం బాగా చదువుకుని, మంచి సంపాదనపరురాలైన యువతి పెద్దగా ఆస్థిపాస్తులు లేకుండా ఎన్నో బాధ్యతలున్న వ్యక్తిని ఇష్టంగా ఎలా పెళ్ళి చేసుకుందో అని చెప్పడానికే! ఒక్కరోజు పెళ్ళి కోసం వూరందరినీ పిలిచి లక్షలు ఖర్చు చేసే తల్లిదండ్రులని అలా చేయవద్దని చెప్పడానికే! పెళ్ళి వేడుక అనేది ఒక ముగింపు కాదు. జీవితాలకి అది ఆరంభం మాత్రమే. జీవితాన్ని సఫలం చేసుకోవాల్సిన జంటకి అది మొదటి మెట్టు.

ఎన్నో పరీక్షలకు తట్టుకుని ఎన్నో గండాలు దాటితేగానీ ఆ ప్రయాణం సఫలం కాదు. వూరికే పైపై కబుర్లు చెప్పడం కాకుండా అటు అత్తమామలకీ, ఇటు అమ్మానాన్నలకీ తోడుగా నిలబడి తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్న మా చిన్నారంటే నాకెప్పటికీ గౌరవమే! ఎవరైనా అలా పెళ్ళి చేసుకుని బాధ్యతల నుండి పారిపోకుండా కుటుంబాలకి అండగా నిలబడితే చూడాలని సరదా!

✤